రాజ్‌భవన్ వద్ద నిరసన కార్యక్రమానికి వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించిన సీఎం, మంత్రులు

అదానీ, రేవంత్ దోస్తానాపై నిరసన తెలుపుతున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి,ప్రశాంత్‌రెడ్డి, గంగుల, ఎమ్మెల్యేలు రాజేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, వివేకానంద, అనిల్‌జాదవ్, సంజయ్, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్

అదానీతో చీకట్లో దోస్తీ వెలుతురులో కుస్తీ!

- ఊసరవెల్లి సిగ్గుపడేలా రేవంత్ సర్కార్ సర్కస్ ఫీట్లు
- నిజాయితీ ఉంటే అదానీతో ఒప్పందాన్ని రద్దు చేయాలి
- సీఎం, కాంగ్రెస్ నేతలపై కేసులు పెట్టాలి : హరీశ్ డిమాండ్

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): వ్యాపారవేత్త గౌతమ్ అదానీ, సీఎం రేవంత్‌రెడ్డి మధ్య బంధం 'చీకట్లో దోస్తీ.. వెలుతురులో కుస్తీ' అనే విషయం అందరికీ తెలిసిపోయిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవాచేశారు. అదానీ విషయంలో కాంగ్రెస్ సర్కార్ సర్కస్ ఫీట్లు చేస్తున్నదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి సర్కస్ ఫీట్లను చూస్తే ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుందని దెప్పిపొడిచారు. రాజ్‌భవన్ వద్ద ట్రాఫిక్ జామ్ చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా ధర్నాలో పాల్గొన్న మంత్రులు, ఇతర కాంగ్రెస్ నేతలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్, చింతా ప్రభాకర్, అనిల్ జాదవ్, పాడి కౌశిక్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, విజయుడుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'చట్టం అందరికీ సమానమే అయితే కాంగ్రెస్ నేతలందరిపైనా కేసులు పెట్టాలి' అని డిమాండ్ చేశారు. అదానీపై మాట్లాడేందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధైర్యం చాలడం లేదని ఎద్దేవాచేశారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజు శాసనసభకు అదానీ, రేవంత్‌రెడ్డి 'ఆర్థిక'బంధాన్ని ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీగా తాము తమ టీషర్ట్స్‌పై స్టిక్కర్లు వేసుకొని నిరసన వ్యక్తం చేస్తే అడ్డుకున్న ప్రభుత్వం, అదే అదానీతో పోరాటం చేస్తున్నామని చెప్పేది నిజమైతే తక్షణమే అదానీతో చేసుకున్న రూ. 12,400 కోట్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదానీ, రేవంత్‌రెడ్డి దోస్తీకి కట్టుబడి సభా ప్రాంగణంలోకి కూడా తమను అడుగు పెట్టనివ్వలేదని ఆయన నిప్పులు చెరిగారు. రాజ్‌భవన్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి అదానీ అవినీతిపై మాట్లాడటం సర్కస్ చేస్తున్నట్టు ఉందని విమర్శించారు. రాజ్‌భవన్ వద్ద కూడా రేవంత్ బీఆర్ఎస్, కేసీఆర్‌పై మాట్లాడిందే ఎక్కువని, అదానీ అవినీతిపై మాట్లాడింది తక్కువని అన్నారు. 'అదానీ మీద మీ పోరాటం నిజమే అయితే మొదటి రోజు మమల్ని అసెంబ్లీకి రాకుండా ఎందుకు అడ్డుకున్నావు? నిరసన తెలిపే అవకాశం కూడా ఎందుకు ఇవ్వలేదు.. మేము అడుగుతున్నా ఎందుకు అసెంబ్లీలో చర్చ పెట్టడం లేదు? దావోస్ వెళ్లి అదానీతో రూ.12,400 కోట్ల అగ్రిమెంట్లు చేసుకున్నావు.. నీకు నిజంగా అదానీ అవినీతి మీద పోరాటం చేయాలనుకుంటే ముందు ఆ అగ్రిమెంట్లు రద్దు చెయ్యి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రామన్న పేటలో డ్రైపోర్టు కోసం భూమి ఇస్తే అందులో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతి ఇచ్చింది సీఎం రేవంత్‌రెడ్డి కాదా? అని ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి అదానీకి ఎజెంట్‌గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించినవారిని అరెస్టులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీపై రేవంత్‌రెడ్డి చేస్తున్న పోరాటంలో నిజాయితీ ఉంటే, ప్రజల మీద కోరిక ఉంటే అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిది డైవర్షన్ పాలిటిక్స్ అని, చేస్తున్నది సర్కస్ ఫీట్లేనని తేల్చిచెప్పారు.

సీఎం పంపిణీ చేసిన చెక్కులూ చెల్లవా?

రాష్ట్రంలో సాక్షాత్తు ముఖ్యమంత్రి పంపిణీ చేసిన చెక్కులు కూడా చెల్లని దయనీయ పరిస్థితి నెలకొన్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవిని దిగజారుస్తున్నారని విమర్శించారు. సహజంగా సీఎం ప్రకటన చేస్తే దానికి తిరుగు ఉండదని, కానీ రాష్ట్రంలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉందన్నారు. బుధవారం అసెంబ్లీ లాబీలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తన స్థాయికి తగిన నిర్ణయాలు తీసుకోవటం లేదని వాపోయారు. రేవంత్‌రెడ్డి తీసుకునే నిర్ణయాలతో దేశవ్యాప్తంగా సీఎం పరువు పోతోందన్నారు. ఇటీవల నవంబర్ 30న రాష్ట్రంలోని 3 లక్షల 13 వేల మంది రైతులకు రుణమాఫీని వర్తింప చేస్తున్నామని, అందు కోసం రూ.2474 కోట్లను విడుదల చేస్తున్నామని సీఎం ప్రకటించారని, 18 రోజులు పూర్తి అయినా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదన్నారు. ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తామని గొప్పలు చెప్పుకుని వరంగల్‌లో స్వయం సహాయక సంఘాలకు ఇచ్చిన రూ.35 కోట్ల చెక్కు, ఆర్టీసీ కార్మికులకు ఫిబ్రవరిలో పీఆర్‌సీ బకాయిలు చెల్లిస్తున్నామని, అందుకోసం విడుదల చేస్తున్నామని ఇచ్చిన రూ. 281 కోట్ల చెక్కు ఇంకా జమకాలేదని ఆయన విమర్శించారు. అయితే, ఇందులో పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉందని, సీఎం బద్నాం అవుతారని భావించి ఆర్టీసీ తన నిధులతో ఆ మొత్తాన్ని సర్దుబాటు చేసిందన్నారు.

అసెంబ్లీలో డ్రంకన్ డ్రైవ్ పెట్టాలె!

- మంత్రి కోమటిరెడ్డిపై హరీశ్‌రావు ఫైర్
- మీరు చెప్పే సుద్దులు మాకొక్కరికే కాదు
- కాంగ్రెస్ నేతలకూ చెప్పాలంటూ దుద్దిళ్లకు చురకలు

హైదరాబాద్, డిసెంబర్18 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో పలువురు నాయకులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని, అలాకాకుండా ఇకపై అసెంబ్లీ వద్ద కూడా డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు పెట్టాలని మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ప్రశ్నోత్తరాల సందర్భంగా కరీంనగర్-కామారెడ్డి- ఎల్లారెడ్డి జాతీయ రహదారి పనుల పురోగతి అంశాన్ని సభ్యుడు మదన్‌మోహన్ లేవనెత్తారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బదులిస్తూ బీఆర్ఎస్‌పై ఆరోపణలకు దిగారు. బీఆర్ఎస్ హయాంలో కమీషన్లు వచ్చే కాళేశ్వరం ప్రాజెక్టు తప్ప రోడ్లను పట్టించుకోలేదంటూ విమర్శలకు దిగారు. దీంతో వెంటనే మాజీ మంత్రి హరీశ్‌రావు జోక్యం చేసుకున్నారు. మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. శాసనసభ రూల్స్ అంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలకే కాకుండా కాంగ్రెస్ సభ్యులకూ సుద్దులు చెప్పాలంటూ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు చురకలంటించారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈసారి నేరుగా హరీశ్‌రావుపై మాటల దాడికి దిగారు. వ్యక్తిగత ఆరోపణలకు దిగగా, హరీశ్‌రావుతోపాటు బీఆర్ఎస్ నేతలంతా ఒక్కసారిగా భగ్గుమన్నారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. కొందరు అసెంబ్లీకి వచ్చి ఇష్టారీతిన మాట్లాడుతున్నారని, ఇకపై అలాకాకుండా ఉండాలంటే 'డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు పెట్టాలి' అంటూ మంత్రి కోమటిరెడ్డిపై విరుచుకుపడ్డారు. దీంతో ఒక్కసారిగా సభ ఉద్రిక్తతంగా మారింది. ఆ తర్వాత స్పీకర్ జోక్యం చేసుకుని హరీశ్‌రావు వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించడంతో గందరగోళం సద్దుమణిగింది.

నిబంధనలు ఇవేనా?

ప్రశ్నోత్తరాలు పూర్తికాకుండానే భూభారతి బిల్లును సభలో ప్రవేశపెట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి స్పీకర్ సూచించారు. దీంతో మంత్రి పొంగులేటి భూభారతి బిల్లును ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శాసనసభ నియమాలకు విరుద్ధంగా ఒకే రోజులో బిల్లును ప్రవేశపెట్టడంతోపాటు, చర్చించడంతోపాటు, సవరణలకు కూడా అవకాశం లేకుండా చేయడమేమిటని నిలదీశారు. కీలకమైన భూభారతి బిల్లుపై చర్చించేందుకు సమయమివ్వాలని డిమాండ్ చేశారు. హరీశ్‌రావు లేవనెత్తిన అంశాలపై ఇతర ప్రతిపక్ష నేతలందరూ మద్దతు పలికారు.

గురుకులాలపై సర్కార్ శ్రద్ధ పెట్టాలి

ప్రభుత్వం గురుకులాలపై సర్కార్ శ్రద్ధ పెట్టాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. గురుకులాలపై చర్చ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. 56 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ అద్దంలా తయారు చేసిచ్చిన గురుకులాలను తాము చెడగొట్టామా? అంటూ చురకలంటించారు. ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో అనేక మంచి పనులు జరిగాయని గుర్తుచేశారు. అంతకంటే బాగా పేరు తెచ్చుకునే పనులు చేయాలని సూచించారు. 1971లో పీవీ నర్సింహారావు సర్వేల్‌లో మొదటి గురుకులం ప్రారంభించారని, 43 ఏండ్లలో ప్రారంభించిన గురుకులాలు 203 మాత్రమేనని, కానీ బీఆర్ఎస్ 819 ఏర్పాటు చేసిందని, విద్యార్థుల సంఖ్య 2 లక్షల నుంచి నేడు 10 లక్షలకు పెరిగిందని, నాడు కొలిచి అన్నం పెడితే, కేసీఆర్ సన్నబియ్యంతో కడుపు నిండా అన్నం పెట్టారని, విదేశాల్లో చదివించేందుకు రూ.20 లక్షల స్కాలర్‌షిప్స్ అందించిన దేశంలో ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ అని కొనియాడారు. 21 ఏండ్లు ఎమ్మెల్యేగా ఉన్నానని, 15 ఏండ్లుగా డిసెంబర్ 31న రాత్రి ఎస్సీ హాస్టల్‌లో అన్నం తిని, అక్కడి విద్యార్థులతో కలిసి వేడుక జరుపుకుంటానని వెల్లడించారు. విద్యార్థుల సమస్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతుంటే అధికార పార్టీ ఎమ్మెల్యేలు శంకర్, రాంచందర్ నాయక్, వెడ్మ బొజ్జు నాన్‌స్టాప్‌గా రన్నింగ్ కామెంటరీ చేస్తూనే ఉన్నారు. దీంతో హరీశ్‌రావు 'మీరు జర నోరు మంచిజేస్కోవాలె' అని సీరియస్‌గా చెప్పారు. దీంతో మళ్లీ హరీశ్‌రావు ప్రసంగం పూర్తయ్యే వరకూ ఆ ముగ్గురిలో ఒక్కరు కూడా కిక్కురుమనలేదు.

ఉద్యోగుల డీఏలు చెల్లించాలి

అసెంబ్లీలో ప్రభుత్వ ఉద్యోగులకు సమస్యలను, ఇతర అంశాలను ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రస్తావించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆరు నెలల్లో ఇస్తామని హామీ ఇచ్చిన పీఆర్సీని అమలు చేయాలని కోరారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీంను పరిమితి లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ సమస్యను పరిష్కరించాలని సూచించారు.

మూతపడిన స్కూళ్లను తెరిపించాలి

కాంగ్రెస్ ఏడాది పాలనలో 1,913 ప్రభుత్వ పాఠశాలలు మూత పడ్డాయని, ఇప్పటికైనా ఆ పాఠశాలల్లో టీచర్లను పెట్టి స్కూళ్లు తెరిపించాలని సూచించారు. 12 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు గురించి మాట్లాడుతున్నామని, బడిలోనో అమ్మ ఒడిలోనో ఉండాల్సిన పిల్లలు వెంటిలేటర్లపై ఉంటున్నారని, పాము కాటు, కుక్కకాటు, ఎలుక కాటు, పుడ్ పాయిజన్, కరెంట్ షాకులు, ఇతర కారణాలతో ఏడాదిలో 54 మంది విద్యార్థుల చనిపోయారని, ఆ విద్యార్థుల వివరాలు పంపుతున్నామని, మానవతా దృక్పథంతో 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అధ్వానంగా మారిన గురుకులాలు

- ఏడాదిలో 54మంది విద్యార్థుల మృతి
- ప్రభుత్వంపై మాజీ మంత్రి గంగుల కమలాకర్ ధ్వజం
- కంట్రోల్ సెంటర్ పునరుద్ధరణకు డిమాండ్

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకులాల్లో పరిస్థితులు అధ్వానంగా మారాయని మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ధ్వజమెత్తారు. గురుకులాలపట్ల ప్రభుత్వ ఉదాసీనత వల్ల రెండు లక్షల మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యే దుస్థితి ఏర్పడిందని తెలిపారు. అసెంబ్లీలో మధ్యాహ్న భోజన విరామం తర్వాత మంత్రి సీతక్క గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై స్వల్పకాలిక చర్చను ప్రారంభించారు. చర్చలో పాల్గొన్న గంగుల కమలాకర్ గురుకులాల్లో పుడ్ పాయిజన్, కరెంట్ షాకులు, ఎలుక కాట్ల ఘటనలు, విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో భవానీ అనే విద్యార్థిని 15సార్లు ఎలుక కాటుకు గురికావడం, ఆసిఫాబాద్ జిల్లాలో అస్వస్థత కారణంగా శైలజ అనే విద్యార్థిని మృతి, నిమ్స్‌లో నీలావతి అనే విద్యార్థిని చికిత్స పొందుతుండటం, నిర్మల్ జిల్లాలో డయేరియాతో 60మంది విద్యార్థులకు అస్వస్థత వంటి ఘటనలను మంత్రి తన ప్రసంగంలో ప్రస్తావించకపోవడం దారుణమని మండిపడ్డారు. తాండూరు గురుకులంలో పుడ్‌పాయిజనింగ్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థులకు చికిత్స నడుస్తున్నదని, ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. కుమ్రంభీం జిల్లా వాంకిడిలో విద్యార్థుల అస్వస్థత, ఓ విద్యార్థిని మృతికి చిప్స్ తినడమే కారణమని ప్రభుత్వం హైకోర్టులో చెప్పడం దారుణమని మండిపడ్డారు.

బీఆర్ఎస్ పాలనలోనే వెలిగిన గురుకులాలు

తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలోనే గురుకులాల అభివృద్ధి జరిగిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో 2014 వరకు 19 బీసీ కురుకులాలు ఉండగా వాటిని బీఆర్ఎస్ హయాంలో 294కు పెంచామని, అలాగే 261గా ఉన్న ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలను సంఖ్యను 1029కి పెంచామని వెల్లడించారు. గతంలో గురుకులాల్లో ఏటా 7,500 మంది విద్యార్థులు మాత్రమే చదువుకునే వీలుండగా, బీఆర్ఎస్ హయాంలో గురుకులాలను పెంచడం వల్ల 2,11,000 మంది విద్యార్థులు చదువుకునే వీలు కలిగిందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క గురుకులాన్ని కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. గురుకులాల పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాంస్య పతక విజేత నందినికి కోటి రూపాయల నగదు బహుమతి, 500గజాల ఇంటి స్థలం ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు.

ఇకనైనా కండ్లు తెరవండి

- గురుకుల ఖ్యాతిని కాపాడండి
- ప్రశ్నిస్తే గొంతు నొక్కుతరా?
- సర్వేల్ ఘటన గురుకులాల దైన్యానికి మరో నిదర్శనం : హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో నెలకొన్న దారుణ పరిస్థితులు గురించి ప్రశ్నిస్తే ప్రతిపక్షాల గొంతు నొక్కడమే తప్ప, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఇప్పటికైనా కండ్లు తెరిచి గురుకులాల ఖ్యాతిని కాపాడాలని హితవుపలికారు. వేడి రాగిజావ పడి గాయపడ్డ విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని బుధవారం ఎక్స్ వేదికగా కోరారు. 'తెలంగాణ గురుకులాల్లో జరుగుతున్న దారుణాలకు ఇది మరో నిదర్శనం. 1971లో ముఖ్యమంత్రి హోదాలో దివంగత పీవీ నరసింహారావు దేశంలో మొదటి గురుకులాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా సర్వేల్‌లో ప్రారంభించారు. ఇప్పుడు అదే గురుకులంలో విద్యార్థితో వంట చేయిస్తే, వేడి రాగిజావ పడి ఆ విద్యార్థి తీవ్రంగా గాయపడి దవాఖాన పాలైన దుస్థితి. ఓవైపు అసెంబ్లీలో గురుకులాలపై చర్చ, మరోవైపు అదే సమయంలో ఈ దారుణం' అని హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యార్థి కాలిన గాయాలకు సంబంధించిన ఫొటోలను షేర్ చేశారు.

13 నెలలుగా జీతాలివ్వరా?

ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే పెసా మొబిలైజర్స్‌కు 13 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం శోచనీయమని హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వీరికి నెలకు రూ.4000 చొప్పున ఒక్కొక్కరికి రూ. 52 వేలు ఈ ప్రభుత్వం బకాయి పడిందని బుధవారం ఎక్స్ వేదికగా తెలిపారు. ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని ప్రచారం చేసుకోవడమే తప్ప, ఆచరణ ప్రశ్నార్థకమవుతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. చిరుద్యోగులకు కూడా జీతాలు చెల్లించకుండా వారిని ఇబ్బంది పెట్టడం దుర్మార్గమని, నెలనెలా వారికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ICFRE - ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ
(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రిసెర్చ్ & ఎడ్యుకేషన్)
(పర్యావరణం, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం క్రింద పని చేస్తున్న ఒక స్వయం ప్రతిపత్తిగల సంస్థ)
దూలపల్లి, కొంపల్లి S.O., హైదరాబాద్-500 100. ఫోన్: 040-66309500.
ఫ్యాక్స్: 040-66309521, ఇ-మెయిల్: director_ifb@icfre.org, వెబ్‌సైట్: http://ifb.icfre.gov.in

నం. 6-406/IFB/Research/APL/2024-25/1860 తేది: 17 డిసెంబర్, 2024

ప్రకటన

ICFRE-ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ (IFB), దూలపల్లి, కొంపల్లి (S.O), హైదరాబాద్-500 100 వద్ద ''ఎవాల్యుయేషన్ ఆఫ్ ఫారెస్ట్రీ & ఫైబర్ సోర్సింగ్ స్టాటజీ ఆఫ్ ఆంధ్ర పేపర్ లిమిటెడ్'' ప్రాజెక్ట్స్‌లో పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన మరియు ప్రాజెక్ట్ కాలవ్యవధితో కో-టెర్మినస్ లేదా ICFRE ప్రమాణాల ప్రకారం అర్హత కాలవ్యవధి పూర్తయ్యేంత వరకు కన్సల్టెంట్ మరియు ఫీల్డ్ అసిస్టెంట్స్ నియామకం కొరకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. ప్రకటన వివరాలు IFB వెబ్‌సైట్ (http://ifb.icfre.org)లో లభిస్తాయి.

గమనిక:

1) కన్సల్టెంట్ ఉద్యోగం కొరకు ఆసక్తిగల మరియు అర్హతగల అభ్యర్థులు ప్రకటన తేదీ నుండి 15 రోజులలోగా ICFRE-ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ (IFB), దూలపల్లి, కొంపల్లి (S.O), హైదరాబాద్-500 100కు పోస్ట్ ద్వారా లేదా director_ifb@icfre.orgకు ఎలక్ట్రానిక్ విధానంలో అనుభవం సర్టిఫికెట్‌తో సహా వారి CVను దాఖలు చేయాల్సిందిగా సూచించడమైనది.

2) ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగాల కొరకు ఆసక్తిగల మరియు అర్హతగల అభ్యర్థులు ప్రతీది స్వయం-ధ్రువీకృత జిరాక్స్ కాపీలతో వారి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, మార్క్ షీట్స్ మరియు దిగువ ఇవ్వబడిన తేదీ మరియు సమయం ప్రకారం తగు విధంగా సంతకం చేయబడిన అనెగ్జర్-1 (టైప్ చేసిన/పూర్తి చేయబడిన)తో ICFRE-ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ (IFB), దూలపల్లి, కొంపల్లి (S.O), హైదరాబాద్-500100 వద్ద 30-12-2024న వాక్-ఇన్-ఇంటర్వ్యూకి హాజరు కావలెను. ఉద్యోగ వివరాలు దిగువ ఇవ్వబడినవి:

క్ర. సం.	పొజిషన్ పేరు	పోస్టుల సంఖ్య	ఎంపిక విధానం
1.	కన్సల్టెంట్	01	వారి దరఖాస్తుల (CV) ఆధారంగా సెలక్షన్ కమిటీ నిర్ణయం తీసుకుంటుంది
2.	ఫీల్డ్ అసిస్టెంట్	05	వాక్-ఇన్-ఇంటర్వ్యూ (30-12-2024)

సం/- డైరెక్టర్

మీడియాతో మాట్లాడుతున్న మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి. చిత్రంలో ఎమ్మెల్సీలు సత్యవతి, కల్వకుంట్ల కవిత, తక్కెళ్లపల్లి, ఎల్ రమణ, కోటిరెడ్డి, యాదవరెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, మహమూద్ అలీ, తాతా మధు, పోచంపల్లి, నవీన్‌కుమార్‌రెడ్డి, దేశపతి

తోడ్కల్ తీస్తమని చెప్పినం

- గురుకుల అద్దె యజమానులను హెచ్చరించాం
- మంత్రి పొన్నం తీవ్రవ్యాఖ్యలు
- గంగులపైనా దురుసు ప్రవర్తన
- 'ఏయ్.. మైక్ తీస్కొని మాట్లాడు' అంటూ అసహనం

హైదరాబాద్, డిసెంబర్ 18(నమస్తే తెలంగాణ): గురుకుల అద్దె భవనాలకు తాళాలు వేసేందుకు యజమానులు సిద్ధమైతే తోడ్కల్ తీస్తమని హెచ్చరించినట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం శాసనసభలో గురుకులాలపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. అద్దె చెల్లించకపోవడంతో యజమానులు గురుకులాలకు తాళాలు వేసేందుకు సిద్ధమయ్యారని, వారిని భయపెట్టో, నచ్చజెప్పో తాళాలు వేయకుండా చేసినట్టు తెలిపారు. గురుకుల అద్దె భవనాలకు బకాయిలు లేకుండా చూస్తామని చెప్పారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'ఏయ్.. మైక్ తీస్కొని మాట్లాడు' అంటూ ఆయన్ను హెచ్చరించే ధోరణితో మాట్లాడటం గమనార్హం. మంత్రి పొన్నం తీరుపై గంగుల కమలాకర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు.

ప్రతిపక్షంలో ఏదైనా మాట్లాడొచ్చు: అక్బరుద్దీన్

హైదరాబాద్, డిసెంబర్ 18(నమస్తే తెలంగాణ): ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏమైనా మాట్లాడొచ్చని, ఇబ్బడి ముబ్బడి హామీలు ఇవ్వొచ్చని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం సవాల్ అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఎంఐఎం సభ్యుడు అక్బరుద్దీన్ ఒవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు బుధవారం శాసనసభలోఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన మెస్‌చార్జీలు ఏ మాత్రం సరిపోవని, ఇంకా పెంచాల్సిన అవసరం ఉన్నదని డిమాండ్ చేశారు. రూ.44.33తో ఒకరోజు మూడు పూటలా భోజనం చేయడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. గుడ్డు ధరను కూడా పెంచాలని, మధ్యాహ్న భోజనం చార్జీలు రూ.1.12 పెంచారని దీంతో విద్యార్థులకు ఎలాంటి భోజనం పెడతారని ప్రశ్నించారు.

పెద్దాపూర్ గురుకులంలో మరో విద్యార్థికి పాముకాటు

మెట్‌పల్లి రూరల్/కోరుట్ల, డిసెంబర్ 18: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాలలో మరో విద్యార్థి పాముకాటుకు గురయ్యాడు. గత జూలై 26న రాజారపు గణాదిత్య, ఆగస్టు 9న ఎడమల్ల అనిరుధ్ అనే ఇద్దరు విద్యార్థులు విష కీటకం కుట్టి చనిపోయిన ఘటనలు మరవకముందే మరో విద్యార్థి బుధవారం పాముకాటుకు గురికావడం కలకలం రేపింది. మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఓంకార్ అఖిల్ పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం స్నానం చేసే సమయంలో చేతికి నొప్పి వస్తుందని, తల తిరుగుతున్నదని తోటి విద్యార్థులకు తెలిపాడు. వారు విషయాన్ని ప్రిన్సిపాల్ మాధవీలత దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమె విద్యార్థి తండ్రి రవికి సమాచారం ఇచ్చి కోరుట్లలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు కుడిచేతి మణికట్టుపై పాముకాటేసినట్టు గుర్తించారు. ముందుజాగ్రత్తగా యాంటీ వీనమ్ ఇంజక్షన్ ఇచ్చి వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది.

సర్వేల్ గురుకులంలో దారుణం

రాగి జావ కాళ్ల మీద పడి విద్యార్థికి తీవ్రగాయాలు

హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థి

సంస్థాన్ నారాయణపుర